క్లుప్తంగా

నేడు మండల సభ

భూత్పూర్: భూత్పూర్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మున్నీ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నామని, మండలంలోని వివిధ శాఖల అధికారులు, సభ్యులు, విధిగా హాజరుకావాలని తెలియజేశారు.

18న ఇంటర్వ్యూలు

కోయిల్‌కొండ: మండలంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శనివారం 18న ఎంపీడీఓ కార్యాలయంలో మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్ సెట్లతో హాజరుకావాలని సూచించారు.

19న 'కల చెదరని స్వప్నం' పరిచయ కార్యక్రమం

పాలమూరు: పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఇక్బాల్ కవిత్వంలోని కల చెదరని స్వప్నం పరిచయ కార్యక్రమం ఈ నెల 19న కొల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలియజేశారు.

స్కాలర్‌షిప్‌కు 40 మంది విద్యార్థుల ఎంపిక

మహమ్మదాబాద్/గండేడ్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్ కోసం ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షను నిర్వహించారు. ఇందులో ఉమ్మడి మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనగా.. 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ.వెయ్యి విద్యార్థుల ఖాతాల్లో జమచేయనున్నారు.

పురాతన బావి అభివృద్ధికి కృషి



కోయిలకొండ: మండల కేంద్రంలోని ఆదిఆంజనేయస్వామి దేవాలయంలో పురాతన కోనేరుఆదిగుండాన్ని బుధవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధిహామి పథకంలో బావిలో పూడిక తీయించి ముళ్లపొదలను తొలగించి, బావి చుట్టూ కంచె వేయిస్తామన్నారు. బావి చుట్టూ అందమైన పూల మొక్కలు నాటించి గార్డెన్ తరహా అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీఓ శ్రీదేవి, నర్సయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



మిడ్జిల్: మండల పరిధిలోని బోయిన్‌పల్లి ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీ చేశారు. ఒంటిపూట బడుల నిర్వహణ, సమయానికి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

క్రీడా ప్రాంగణం పరిశీలన



మిడ్జిల్: మండల పరిధిలోని కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని గురువారం తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి పరిశీలించారు. క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా పనులు చక్కగా చేయాలని సూచించారు. క్రీడా మైదానాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియన్ కరాటే పోటీల్లో ప్రతిభ

మిడ్జిల్: ఇటీవల జడ్చర్లలో నిర్వహించిన సౌత్ ఇండియన్ కరాటే ఛాంపియన్ పోటీల్లో మిడ్జిల్ సేయింట్ మేరిస్ పాఠశాల విద్యార్థులు అలీషా, అభిషేక్, గోల్డ్ మెడల్, బెటీనా, భవాని, దక్షశ్రీ, హర్షిత్, సిల్వర్ మెడల్, శ్రీలక్ష్మి, అక్షర, ప్రవీణ్, సాయికిరణ్, రజిత పథకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోసఫ్ తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించారు.



మెరుగైన ఫలితాలు సాధించాలి



పారుపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ యాదయ్య

కోయిల్‌కొండ: రానున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబర్చాలని డీఈఓ యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని పారుపల్లి, కోయిల్‌కొండ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పారుపల్లిలో జరుగుతున్న ఎంఎంబి పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపి క్యాంపును సందర్శించి సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల హాజరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మార్సీలో రికార్డులను తనిఖీ చేశారు. ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ నాయక్, శంకర్ పాల్గొన్నారు.

'చలో పార్లమెంట్' జయప్రదం చేయండి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. ఏప్రిల్ 5న తలపెట్టనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ పిలుపునిచ్చారు. చలోపార్లమెంట్ విజయవంతం చేసేందుకు చేస్తున్న ప్రచారంలో భాగంగా.. గురువారం పట్టణంలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా దేశంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలను, రైతు ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి జిల్లా కేంద్రాల వరకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జగన్, తెలుగు సత్తయ్య, నాగయ్య, సాయిలు, శ్రీశైలం, రాములు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న యాదయ్య

హన్వాడ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఓ యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ.. శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో ఆరుబయట మలవిసర్జన, డ్రైయినేజీ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఎంపీపీ బాల్‌రాజు, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఈజీఎస్ ఏపీఓ హేమలత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదరుర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం



దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని కో- ఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 176 మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. బాలికల జూనియర్ కళాశాలలో 282 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజరయ్యారు. విశ్వవికాస్ కళాశాలలో 323 మంది విద్యార్థులకు 25 మంది గైర్హాజరయ్యారు. వైష్ణవి కళాశాలలో 364 మంది విద్యార్థులకు 9 మంది గైర్హాజరయ్యారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 501 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

భూత్పూర్: పట్టణంలోని జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరంలో 211 మంది విద్యా లు ఉండగా 209 మంది విద్యార్థులు హాజరు కాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ తెలియజేశారు.

బాలానగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 397 మంది విద్యార్థులకు 11 మంది గైర్హాజరై 386 విద్యార్థులు పరీక్షలు రాశారు. ఒకేషనల్‌లో 34 మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు హాజరు కాలేదని అధికారులు చెప్పారు.

మహమ్మదాబాద్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజు 508 మంది విద్యార్థులు హాజరు కాగా 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నంచర్ల గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



మాడ్రన్ స్కూల్‌లో విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న శ్రీహిత

మంత్రి శ్రీనివాస్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఎనుగొండలోని అనాథాశ్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు కార్యకర్తల మధ్యన మంత్రి సతీమణి శారద కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అంధుల ఆశ్రమ పాఠశాలలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, శ్రీకాంత్ గౌడ్, రాజేశ్వర్, కౌన్సిలర్లు కేక్ కట్ చేశారు.

- శ్రీనివాస కాలనీ శివాలయంలో, బస్టాండ్ వద్ద ఉన్న ఎల్లమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి సతీమణి శారద ప్రారంభించారు. తెలంగాణ చౌరస్తాలోని మోడ్రన్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శ్రీహిత ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు.
- జిల్లా కేంద్రంలో పలు చోట్ల కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీఎన్‌జీఓ భవన్‌లో టీఎన్‌జీఓ, టీజీఓ యూనియన్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. టీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, రాజ్‌గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, నర్సింగ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.
- టీఆర్ఎస్వీ నాయకుడు, శరత్‌కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన 'పాలమూరు ముద్దుబిడ్డ శ్రీనివాస్‌గౌడ్' పేరుతో తయారు చేసిన వీడియో పాట సీడీని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.
- తిమ్మసాన్‌పల్లికి చెందిన ఏసుదాస్ పట్టణంలోని టచ్ అనాథ శరణాలయంలో కేకు కట్ చేశారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.
- కోయిల్‌కొండలో గౌడ సంఘం నాయకులు ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు.
- హన్వాడలో మంత్రి సతీమణి శారద, మంత్రి సోదరుడు శ్రీకాంత్‌గౌడ్ విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ గంగాపురి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మొత్తం 250 మంది చిన్నారులకు టై బెల్టులను పంపిణీ చేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



అనాథ ఆశ్రమంలో కేకు కట్‌చేస్తున్న ఏసుదాస్

మహిళా సాధికారతకు కృషి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): శాంతా నారాయణ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, భవిష్యత్‌లోనూ మరింత విస్తృతంగా తమ కార్యక్రమాలు కొనసాగుతాయని ట్రస్ట్ చైర్‌పర్సన్ శ్రీహిత తెలిపారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా సెయింట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళల నైపుణ్య శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తన తండ్రి శ్రీనివాస్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా సెయింట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు ఉద్యోగాలను కల్పించేలా 100 రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. పద్మశ్రీ, మోహన్ రెడ్డి,పద్మావతి, వేమారెడ్డి, హేమలత పాల్గొన్నారు.

పొలం తగాదాలో ఒకరి మృతి

బాలానగర్: పొలం వద్ద జరిగిన చిన్నపాటి తగాదాలతో ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవల్లో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. విషయం తెలిసిన గ్రామస్తులు పరిహారంగా ఇరువర్గాలతో మాట్లాడి రూ.3.50 లక్షలతో రాజీ కుదుర్చుకున్నారని సమాచారం. ఈ సంఘటనపై ఎస్ఐ జయ ప్రసాద్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రివేళలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గండేడ్ మండల పరిధిలోని సల్కర్‌పేట్‌కి చెందిన నల్ల తిరుపతయ్య అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్నాడు. ఇదే తరుణంలో గురువారం తెల్లవారుజామున వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. అదే సమయంలో గస్తీ తిరుగుతున్న పోలీసులు పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ సైదయ్య తెలియజేశారు.

దుకాణంలో చోరీ

జడ్చర్ల: స్థానిక క్లబ్‌రోడ్‌లోని ఓ కిరాణ దుకాణం షట్టర్‌ను పైకి ఎత్తి చోరీ చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ లెనిన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి కిరాణ దుకాణం మూసి వెళ్లిన తర్వాత అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్‌ను పైకి ఎత్తి రూ.1000 నగదును అపహరించుకెళ్లినట్లు బాధితుడు రాఘవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

దగ్ధమైన కిరాణ షాప్ పరిశీలన



భూత్పూర్: మండలంలోని కప్పెటలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన యాదయ్య కిరాణ దుకాణం దగ్ధమవగా.. గురువారం భూత్పూర్ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్ పరిశీలించారు. యాదయ్య కిరాణ దుకాణం దగ్ధమవడానికి కారణాలు, ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా దగ్ధం చేశారా అని చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుడికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, వైఎస్ ఎంపీపీ నరేష్ గౌడ్, సర్పంచ్ వేణుగోపాల్, సత్యనారాయణ, మాసగౌడ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు న్యాయమూర్తి జరిమానాలు విధించారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ఈ నెల 15న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఏడుగురు వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. పట్టుబడిన ఏడుగురు వాహనదారులను గురువారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. దీంతో న్యాయమూర్తి నిర్మల ఆరుగురు వాహనదారులకు జరిమానాతో పాటు మరో వాహనదారుడికి మూడు వేల జరిమానాతో పాటు 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ.. తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అశోక్ మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

బస్సులను తిరిగి ప్రారంభించాలని వినతి



మిడ్జిల్: మండల పరిధిలోని వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి గ్రామాలకు 20 సంవత్సరాలుగా నడుస్తున్న బస్సులను రద్దు చేశారని, అలాగే కద్తాల్, మిడ్జిల్ బస్‌ను మూడు నెలల నుంచి కల్వకుర్తి డిపో వారు రద్దు చేశారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రద్దయిన బస్సులను తిరిగి ప్రారంభించాలని కోరుతూ.. బీజేపీ మండల నాయకలు గురువారం డిప్యూటీ తహసీల్దార్ గీతకు, ఎంపీడీఓ సాయిలక్ష్మికి వినతి అందజేశారు. మండల అధ్యక్షుడు నరేందర్, తిరుపతి, అరవింద్, శ్రీశైలం, అంజి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లికి సాయం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హన్వాడ మండలానికి చెందిన శిరీషా వివాహం గురువారం ఉండగా.. పెళ్లికి అవసరమైన పుస్తె, మెట్టెలు, చీర, సారెను తెలంగాణ ఉద్యమకారుడు మున్నూర్‌రవి, గౌతమి సతీసమేతంగా నవవధువుకు పెళ్లి మండపానికి వెళ్లి అందజేశారు. తల్లిదండ్రులైన రాంచంద్రయ్య, బాలమని మృతిచెందడంతో పెళ్లి భారంగా మారడంతో విషయం తెలుసుకున్న ఆయన సాయం చేసినట్లు చెప్పారు. మైత్రి యాదయ్యాముదిరాజ్, పటేల్ వెంకటేశ్, బాలగోపి, ఆంజనేయులు, ఆంజనేయ ప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రభుత్వాలు కృషి



అవగాహన కల్పిస్తున్న గీత

చిన్నచింతకుంట: మహిళల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మహిళ శిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డీనేటర్ గీతా అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలం బండ్రవల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు సమాజంలో గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. మహిళలు అత్యవసర సమయంలో పోలీసుల సమాచారం కోసం 100కు, శిశు సంక్షేమ శాఖ కోసం 1098, మహిళ రక్షణకు 181కి ఫోన్ చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, పుష్పలత, రుక్మిణి, దేవి, జయమ్మ పలువురు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములును స్ఫూర్తిగా తీసుకోవాలి



జిల్లా కేంద్రంలో జయంతి వేడుకల్లో సభ్యులు

జడ్చర్ల టౌన్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పాలాది రామ్మోహన్ పిలుపునిచ్చారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వ్యాపారం, సమాజసేవతో పాటు రాజకీయాల్లోనూ ఆర్యవైశ్యులు ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారని, వారందరూ పొట్టిశ్రీరాములును ఆదర్శంగా తీసుకుకోవాలన్నారు. వాసవీక్లబ్ జోనల్ అధ్యక్షుడు మేడిశెట్టి రామకృష్ణ, కొట్రమధు, ప్రభు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. కలెక్టర్ బంగ్లా చౌరస్తాలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వలకొండ చంద్రశేఖర్, భాస్కర్, రాఘవేందర్, రాము, శ్రీదేవి, రాధిక, లావణ్య పాల్గొన్నారు.

నవగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు కావేరమ్మపేట చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో గురువారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల అనంతరం అన్నదానం చేశారు.

వైభవంగా ద్వారకామాయి బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని ద్వారకామాయి బాబా మందిరం పంచమదశ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం హారతి, దేవతా పూజ, మహాన్యాస పారాయణం, 108 కలశాలతో అష్టోత్తర శతక్షీర కుంభాభిషేక పూజ నిర్వహించారు. ఏకాదశ రుద్ర పారాయణం, పుష్పార్చన, నైవేద్యం, మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు.

పనులు వేగవంతం చేయాలి



గండేడ్: ఉపాధిహామి పనల్లో వేగవంతం పెంచాలని గండేడ్ ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లిలో ఉపాధిహామి పథకం కింద ల్యాండ్ లెవలింగ్ పనులు చేపడుతున్నారు. ఈ పనులను ఆయన పరిశీలించారు. కూలీలు ఎంత మంది ఉన్నారు, పనులు ఏమేర కొనసాగుతున్నాయని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.

వాల్మీకుల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని వాల్మీకి మేధావుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంబీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని శికర్‌గానిపల్లిలో ఇంటింటికి వాల్మీకి సందేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, తిరుపతయ్య, సిద్ధప్ప, నర్సింహ, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో 'కంటి వెలుగు' కొనసాగుతోంది. తాజాగా గురువారం 1,512 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 206 మందికి రీడింగ్ గ్లాసెస్ ఇచ్చారు. అలాగే 157 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు అందజేశారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 55,086 మందిని పరీక్షించి 9,917 మందికి రీడింగ్ గ్లాసెస్ ఇచ్చారు. అలాగే 5,551 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేశారు.

జూలపల్లిలో..

మహమ్మదాబాద్: మండల పరిధిలోని జూలపల్లిలో గురువారం కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిరణ్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కంటివెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంటివెలుగు వైద్యాధికారి మహమ్మద్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ప్రేమ్‌నగర్‌లోని ముదిరాజ్ కమ్యూనిటీ భవనంలో 'కంటివెలుగు'లో వైద్యులు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



మిడ్జిల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో..



బాలానగర్‌లో..

మిడ్జిల్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ప్రశ్నాపత్రాలను లీక్ చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. గురువారం మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుపతి మాట్లాడారు. ప్రశ్నా పత్రం లీకేజీ విషయంపై ఆందోళన చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేయడం దారుణమన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్, రామకృష్ణ, నరేష్, చారి, విష్ణు, శివ, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: టీఎస్‌పీఎస్సీలో ఏఈ ప్రశ్నాపత్రం లీకేజీపై ప్రశ్నించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్‌ని వెంటనే విడుదల చేసి లీకేజీకి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కోట కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో బీజేవైఎం నాయకుల అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేవైఎం జిల్లా ఇన్‌చార్జ్ బండి దీక్షిత్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, అరవింద్ రెడ్డి, నాయకులు భానుప్రతాప్, మల్లేష్ యాదవ్, యాదయ్య, రాజునాయక్, లింగం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామర్ స్కూల్‌లో మాక్ అసెంబ్లీ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో గురువారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న స్కీమ్ పథకాలను వివరించారు. మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పింఛన్లు, కంటి వెలుగు, రైతుబంధు గురించి విద్యార్థులు వివరించారు. ఆరో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. అసెంబ్లీలో స్పీకర్, ఎమ్మెల్యేల పాత్ర నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత పాల్గొన్నారు.